## నటుడు సౌరవ్ గుజ్జర్‌పై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు

- **పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారంటూ యువతి ఆరోపణ**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్:**



నటుడు, రెజ్లర్ సౌరవ్ గుజ్జర్‌పై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా, మానసికంగా వేధించారని ఆమె ఆరోపించినట్లు సమాచారం. ఆగస్టు 15న యువతి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

ఫిర్యాదు వివరాల ప్రకారం.. 2021లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సౌరవ్ గుజ్జర్‌తో పరిచయం ఏర్పడిందని, అనంతరం వాట్సాప్ ద్వారా సన్నిహితంగా ఉన్నామని యువతి పేర్కొంది. 2021 డిసెంబర్ 25న తొలిసారి కలుసుకున్నామని, పెళ్లి చేసుకుని భార్యతో సమాన హక్కులు కల్పిస్తానని హామీ ఇచ్చారని తెలిపింది.

అమెరికాలో ఉన్న సమయంలోనూ, భారత్‌కు వచ్చిన తర్వాత కూడా కలిసి జీవించామని, కలిసి వ్యాపారం చేద్దామని నమ్మించడంతో అమెరికాలోని ఉద్యోగాన్ని వదిలి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. పెళ్లి విషయాన్ని ప్రస్తావించినప్పుడల్లా తనను ఫోన్‌లో బ్లాక్ చేసి దూరంగా ఉండేవాడని ఆమె ఆరోపించింది.

2025 అక్టోబర్ నుంచి 2026 మార్చి వరకు తనతో ఉన్న సౌరవ్ అనంతరం హైదరాబాద్‌కు వచ్చి కొంతకాలం కలిసి ఉన్నారని, ఆ తర్వాత ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయారని యువతి ఆరోపించింది.

ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు సౌరవ్ గుజ్జర్‌ను ముంబై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తదుపరి న్యాయ ప్రక్రియలో భాగంగా రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు వెల్లడించినట్లు సమాచారం.

## రోడ్డుపై బోల్తాపడిన కారును చూసి ఆగిన కేంద్రమంత్రి బండి సంజయ్





- **ప్రమాద బాధితులకు స్వయంగా సహాయం చేసిన కేంద్రమంత్రి**

**ఆశ్వి అప్డేట్స్:**

రోడ్డుపై కారు బోల్తాపడి ప్రమాదానికి గురైన ఘటనను గమనించిన కేంద్రమంత్రి బండి సంజయ్ అక్కడ ఆగి బాధితులకు సహాయం అందించారు. ప్రమాద పరిస్థితిని పరిశీలించి, బాధితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని కోరినట్లు సమాచారం. ప్రమాద సమయంలో కేంద్రమంత్రి స్పందించిన తీరు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు 'రుద్రమ' లేదా 'కాకతీయ' పేరు




- **పేర్లను సూచించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా.. 'దట్స్ ది స్పిరిట్' అంటూ సీఎం రేవంత్ రెడ్డి స్పందన**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్:**

వరంగల్ మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి పేర్లు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరిన నేపథ్యంలో ప్రముఖ సినీ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా స్పందించారు. తన సొంత ప్రాంతమైన వరంగల్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కానుండటంపై సంతోషం వ్యక్తం చేసిన ఆయన.. 'రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్' (RIA), 'కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్' (KIA) పేర్లను సూచించారు.

వరంగల్ చారిత్రక నేపథ్యం, కాకతీయుల వారసత్వాన్ని ప్రతిబింబించేలా విమానాశ్రయానికి పేరు ఉంటే అర్థవంతంగా ఉంటుందని సందీప్ రెడ్డి వంగా పేర్కొన్నారు. విమానాశ్రయాన్ని సాకారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సందీప్ రెడ్డి వంగా సూచనకు సీఎం రేవంత్‌రెడ్డి "That's the SPIRIT..!!" అంటూ స్పందించారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న 'Spirit' సినిమా నేపథ్యంలో సీఎం స్పందనలోని 'Spirit' పదం సినీ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. అనంతరం సందీప్ వంగా కూడా అదే విషయాన్ని ప్రస్తావిస్తూ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

వరంగల్ మామునూరు విమానాశ్రయానికి తుది పేరు ఇంకా ఖరారు కాలేదు. పేరుపై వివిధ వర్గాల నుంచి సూచనలు వస్తున్నాయి.




## పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- **రెండు రోజుల పర్యటనలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**ఆశ్వి అప్డేట్స్ | పిఠాపురం:**

పిఠాపురం నియోజకవర్గంలో దాదాపు రూ.1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టనున్నారు. రెండు రోజులపాటు నియోజకవర్గంలో పర్యటించనున్న ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.

నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, తీర ప్రాంత రక్షణ, మత్స్యకారుల సంక్షేమం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు కార్యక్రమాలను చేపట్టనున్నారు.




**కీలక అభివృద్ధి పనులు**

* రూ.307 కోట్లతో జల్‌జీవన్ మిషన్, అమరజీవి జలధారల నిధులతో మల్టీ విలేజ్ వాటర్ స్కీమ్
* రూ.200 కోట్లతో పిఠాపురం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ
* రూ.80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్
* రూ.100 కోట్లతో సాస్కీ నిధుల ద్వారా రహదారుల నిర్మాణం
* రూ.118 కోట్లతో పిఠాపురం రోడ్ ఓవర్ బ్రిడ్జి
* రూ.323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ
* అమృత్ 2.0 నిధులతో పిఠాపురం మున్సిపాలిటీ వాటర్ వర్క్స్

సోమవారం ఉప్పాడ కొత్తపల్లి, పిఠాపురం రూరల్ మండలాల పరిధిలోని సుమారు 52 ఆవాసాల్లో 97 వేల మందికి తాగునీరు అందించేలా రూ.9.59 కోట్లతో ఆధునీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించనున్నారు. పిఠాపురం పట్టణంలో నిర్మించిన *'పీఠికాపుర వనం'*తో పాటు చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డు, ఎఫ్.కె.పాలెం మైసమ్మ చెరువుల అభివృద్ధి పనులను కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

మంగళవారం జరిగే బహిరంగ సభలో పలు కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారులకు అధునాతన లైఫ్ జాకెట్లు, డ్రై ఫిష్ యూనిట్లు, ఐస్ బాక్సులతో కూడిన మోటార్ సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు సెర్ప్, మెప్మా సహకారంతో రూ.120 కోట్ల రుణాలు అందజేయనున్నారు. 89 మంది లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ పట్టాలను పంపిణీ చేయనున్నారు.

పిఠాపురం నియోజకవర్గానికి మెరుగైన మౌలిక వసతులు కల్పించడం, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడం, తీర ప్రాంత రక్షణ, మత్స్యకారుల సంక్షేమం, మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యత ఇవ్వడం ఈ పర్యటనలోని ప్రధాన అంశాలుగా ఉన్నాయి. పిఠాపురాన్ని అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

## ఇబ్రహీంపట్నంలో భూకబ్జాలపై విచారణ జరిపిస్తాం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి

- **బీఆర్ఎస్ హయాంలో ఆక్రమణలకు గురైన భూముల వివరాలు వెలుగులోకి తెస్తామన్న ఎమ్మెల్యే**

**ఆశ్వి అప్డేట్స్ | ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గతంలో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న భూకబ్జాల వ్యవహారాలపై వివరాలను వెలుగులోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైనట్లు గుర్తించిన భూముల వివరాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.



విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ.. బీఆర్ఎస్ నేతలు, వారి అనుచరులు ఆక్రమించారని ఆరోపణలు ఉన్న భూముల వివరాలను బయటపెడతామని, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే వాటిని చట్ట ప్రకారం స్వాధీనం చేసుకునే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

నియోజకవర్గానికి ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు, జరుగుతున్న అభివృద్ధి పనులపై కొందరు విమర్శలు చేస్తున్నారని మల్‌రెడ్డి అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, తమ ప్రభుత్వం రెండున్నరేళ్లలో చేపట్టిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు.

అంబేడ్కర్ చౌరస్తాలో తన పార్టీ నాయకులతో కలిసి చర్చకు రావాలని ఆయన సవాల్ చేశారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ప్రధాన లక్ష్యమని మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.

భూకబ్జాలకు సంబంధించిన ఆరోపణలు రాజకీయ పార్టీల మధ్య కొనసాగుతున్న వివాదంలో భాగంగా ఉన్నాయి. ఇటీవల రాష్ట్రంలో భూములపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు.

## గణేష్ మండపాల్లో మధుయాష్కి గౌడ్ ప్రత్యేక పూజలు

- **మన్సూరాబాద్‌లో పలు వినాయక మండపాలను సందర్శించిన మాజీ ఎంపీ**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ మన్సూరాబాద్ డివిజన్‌లోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సహారా స్టేట్స్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని, సౌత్ అండ్ పార్క్ కాలనీ రోడ్డులో జెట్టి అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని, మన్సూరాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మధుయాష్కి గౌడ్ దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మలక్‌పేటలో సీనియర్ న్యాయవాది శ్రీనాథ్ ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కూడా సందర్శించి పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ పృథ్వీ చౌదరి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణ, సీనియర్ నాయకులు మకుటం సదాశివుడు, కుట్ల నర్సింహా యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ యాదవ్, కొండోజు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి దాము మహేందర్ యాదవ్, సురేష్ యాదవ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలన: బీఆర్ఎస్ నేత వెంకటేష్






- **ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపణ**

**ఆశ్వి అప్డేట్స్ | చేవెళ్ల | సెప్టెంబర్ 19:**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి నిరంకుశ పాలన సాగిస్తోందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గౌడిచర్ల వెంకటేష్ ఆరోపించారు.

మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు, వేధింపులకు పాల్పడుతోందని విమర్శించారు. రంగారెడ్డి జిల్లా జన్వాడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీజుకు తీసుకున్న ఫామ్‌హౌస్ వ్యవహారాన్ని ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం వివాదంగా మారుస్తోందని ఆరోపించారు.

ప్రైవేటు వ్యక్తుల మధ్య కుదిరిన లీజు ఒప్పందాన్ని కూడా రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో కక్షసాధింపు చర్యలకు తావు ఉండకూడదని, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని వెంకటేష్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై ప్రజలు తగిన సమయంలో స్పందిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలాపూర్ మహా గణనాథుని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

- **ఈటల రాజేందర్‌తో కలిసి ప్రత్యేక పూజలు**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బాలాపూర్ మహా గణనాథుడిని దర్శించుకున్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, శ్రేయస్సు వెల్లివిరియాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



## విద్యార్థుల యూనిఫాంలు మరింత ఆకర్షణీయంగా ఉండాలి



- **డిజైన్లలో వైవిధ్యం తీసుకురావాలి.. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాంలు, సామగ్రి అందించాలి: సీఎం రేవంత్‌రెడ్డి**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్:**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాంలను మరింత ఆకర్షణీయమైన రంగులు, వైవిధ్యమైన డిజైన్లతో రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాంలు, ఇతర సామగ్రి పంపిణీపై సీఎం సమీక్ష నిర్వహించారు.

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జతను ఈ నెలాఖరులోగా అందజేస్తామని అధికారులు తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు ఇప్పటికే అందించినట్లు వెల్లడించారు.

విద్యార్థులందరికీ నోట్ పుస్తకాల పంపిణీ పూర్తయిందని, వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు, టవళ్లు కూడా పంపిణీ చేసినట్లు అధికారులు వివరించారు.

వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమైన రోజే విద్యార్థులకు యూనిఫాంలు, ఇతర సామగ్రి అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. ప్రస్తుత విద్యార్థుల సంఖ్యకు అదనంగా 10 శాతం మంది చేరే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఈ ఏడాది పంపిణీ చేసిన యూనిఫాంలు, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని అధికారులు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## గణేష్ నిమజ్జనాల్లో పోలీసుల సమర్థవంతమైన చర్యలు



- **చెరువుల వద్ద పటిష్ట బందోబస్తు.. ట్రాఫిక్ నియంత్రణతో భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

**ఆశ్వి అప్డేట్స్ | వనస్థలిపురం:**

గణేష్ నిమజ్జనాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు వనస్థలిపురం పోలీసులు చేపట్టిన చర్యలు భక్తుల ప్రశంసలు అందుకున్నాయి. వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి స్వయంగా మన్సూరాబాద్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లోని చెరువులను పరిశీలిస్తూ పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భారీ సంఖ్యలో గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తున్న నేపథ్యంలో చెరువుల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జన ఊరేగింపుల సమయంలో జాతీయ రహదారులు, చెరువులకు అనుసంధానమైన ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ నిలిచిపోకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

పోలీసుల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా సాగడంతో భక్తులు పోలీసు సిబ్బంది సేవలను అభినందించారు. రెండు రోజుల్లో శుక్రవారం సుమారు 170, శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు సుమారు 150 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు ఏసీపీ కాశిరెడ్డి తెలిపారు.

ఈ ఏర్పాట్లలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించారు.



## విద్యార్థిపై దాడి.. ఆర్టీసీ డ్రైవర్‌పై వేటు

**ఆశ్వి అప్డేట్స్ | మహబూబాబాద్, సెప్టెంబర్ 19:**

నెల్లికుదురు సమీపంలో పాఠశాల విద్యార్థిపై అసభ్యకరంగా ప్రవర్తించి, దాడికి పాల్పడ్డారనే ఆరోపణలపై తొర్రూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ స్వామి (స్టాఫ్ నం.2047)పై టీజీఎస్ఆర్టీసీ చర్యలు చేపట్టింది. బస్సు నంబర్ TS26T1266 డ్రైవర్‌ను విధుల నుంచి తొలగిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది.

ఘటనపై సమాచారం అందిన వెంటనే ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించగా, డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా, దురుసుగా ప్రవర్తించినట్లు విచారణలో తేలడంతో చర్యలు తీసుకున్నట్లు ఆర్టీసీ తెలిపింది.

ప్రయాణికులు, ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వయోవృద్ధుల భద్రత, గౌరవానికి సంస్థ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. ప్రయాణికులతో సౌమ్యంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశిస్తూ, క్రమశిక్షణా రాహిత్యాన్ని సహించబోమని హెచ్చరించింది.




# దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు





- **విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు: కలెక్టర్ దివాకర టీఎస్**
- **భద్రత, ట్రాఫిక్, వైద్య, పారిశుద్ధ్య ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు**

**ఆశ్వి అప్డేట్స్ | ఖమ్మం, సెప్టెంబర్ 19:**

గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని దంసలాపురం చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు.

నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. చెరువు వద్ద బారికేడింగ్, గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎత్తైన విగ్రహాల తరలింపునకు ప్రత్యేక రూట్‌మ్యాప్ రూపొందించి, విద్యుత్ వైర్లు, చెట్ల కొమ్మల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు నివారించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేకంగా పర్యవేక్షించాలని సూచించారు.

ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద వైద్య శిబిరం, 108 వాహనం, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, పారిశుద్ధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలని ఆదేశించారు.

క్రేన్లకు అదనపు డ్రైవర్లు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించి, వారి విధులపై ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు. ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరిస్తూ స్వీయ నియంత్రణ పాటించాలని, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, అర్బన్ తహసీల్దార్ జయచందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి ట్రాఫిక్ మార్గదర్శకాలు

- **నిమజ్జన పాయింట్‌కు ప్రత్యేక మార్గాలు.. తిరుగు ప్రయాణంలో వన్‌వే**

**ఆశ్వి అప్డేట్స్ | ఖమ్మం:**

గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ఖమ్మం నగరంలో విగ్రహాల తరలింపు, తిరుగు ప్రయాణానికి పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ మార్గాలను సూచించారు.


రూరల్, బల్లేపల్లి, కొత్త బస్టాండ్, బీసీ కాలనీ తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు బైపాస్-ఎన్టీఆర్ సర్కిల్-ఇల్లందు ఎక్స్‌రోడ్-జడ్పీ సెంటర్-చెరువు బజార్-చర్చి కాంపౌండ్-శ్రీరామ్ హిల్స్ మీదుగా దంసలాపురం చెరువు నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.

గాంధీనగర్, మోతీనగర్, గాంధీచౌక్, బొక్కలగడ్డ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు నయాబజార్-మయూరి సెంటర్-కిన్నెర సెంటర్-జడ్పీ సెంటర్-చెరువు బజార్-చర్చి కాంపౌండ్ మార్గంలో వెళ్లాలి.

శ్రీశ్రీ సర్కిల్, శ్రీనగర్, ఇందిరానగర్, మమతా కాలేజ్, వెంకటగిరి, ప్రకాష్‌నగర్, అల్లిపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు సంబంధిత సూచిత మార్గాల ద్వారా చర్చి కాంపౌండ్ మీదుగా నిమజ్జన పాయింట్‌కు చేరుకోవాలి.

నిమజ్జనం అనంతరం జయశంకర్ విగ్రహం నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి. బయటకు వెళ్లే మార్గాల్లో వన్‌వే ట్రాఫిక్ మాత్రమే అనుమతిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రజలు ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని అధికారులు కోరారు.




# మంగళగిరిలో మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌కు శ్రీకారం




- **యువ మహిళా క్రికెటర్లకు ప్రతిభ చాటుకునే వేదిక: తొలి WAPLపై హర్షం**

**ఆశ్వి అప్డేట్స్ | మంగళగిరి:**

మంగళగిరిలో తొలిసారిగా మహిళల ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (WAPL)కు శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తమైంది. రాష్ట్రంలోని యువ మహిళా క్రికెటర్లు తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు ఉన్నత స్థాయికి ఎదగడానికి ఈ లీగ్ మంచి వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ క్రికెటర్ మిథాలీ రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా బాధ్యతలు స్వీకరించడం పట్ల అభినందనలు వ్యక్తమయ్యాయి. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన



ఈ లీగ్ ద్వారా యువ క్రీడాకారిణులకు భవిష్యత్తులో మహిళల ప్రీమియర్ లీగ్ (WPL), భారత జట్టు వంటి ఉన్నత స్థాయి క్రికెట్‌కు మార్గం సుగమం కావాలనే ఆకాంక్ష వ్యక్తమైంది. తొలి సీజన్‌లో పాల్గొంటున్న నాలుగు జట్లకు,




యువ క్రీడాకారిణులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి భవిష్యత్తులో మరెందరో ప్రతిభావంతులైన మహిళా క్రికెటర్లు జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.


# తాగునీటిని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

- **జూబ్లీహిల్స్‌లో వినియోగదారుడికి రూ.20 వేల జరిమానా**

**ఆశ్వి అప్డేట్స్ | హైదరాబాద్:**

తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 23లో తాగునీటిని ఫ్లోర్ క్లీనింగ్‌కు వినియోగిస్తున్నట్లు గుర్తించిన ఓ వినియోగదారుడికి రూ.20 వేల జరిమానా విధించి వసూలు చేసింది.

తాగునీరు అత్యంత విలువైన వనరు కావడంతో



ప్రజలు నీటిని బాధ్యతాయుతంగా వినియోగించాలని జలమండలి సూచించింది. తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించడం, వృథా



చేయడం వంటి చర్యలకు పాల్పడితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. తాగునీటి దుర్వినియోగం ఎక్కడైనా కనిపిస్తే సంబంధిత వివరాలను జలమండలి వాట్సాప్ నంబర్ 99499 30003కు పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.



# వానా కాలం.. వ్యాధుల గాలం..

## ఈ జాగ్రత్తలతో పిల్లల ఆరోగ్యం పదిలం

వేసవి కాలం ముగిసిపోయింది.. ఎండలు తగ్గి వర్షా లు ప్రారంభమయ్యాయి. అకస్మాత్తుగా వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. ఈ సమయంలో పిల్లల ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఈ కాలంలో జ్వరం, జలుబు, శ్వాస సంబంధిత ఇబ్బందులు, ఇన్ఫెక్షన్లు, విరోచనాలు వంటి రకరకాల సమస్యలు చిన్న పిల్లలను వేధిస్తాయి. ఈ కాలంలో పరిశుభ్రమైన పరిసరాలతో, ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత పెద్దలపై ఉంది. బడులు తెరుచుకోవడంతో చాలామంది పిల్లలు వర్షంలో తడుస్తూనే పాఠశాలలకు వెళ్తూ వస్తూ ఉంటారు.. స్నేహితులతో వర్షంలో తడుస్తూ ఆడుకుంటుంటూ ఉంటారు. దీంతో వ్యాధులు వచ్చే అవకాశం మరింత ఎక్కువగా ఉంది. వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటాయి. దీని కోసం ముందు జాగ్రత్తగా పిల్లలు బయటికి వెళ్లేటప్పుడు, స్కూలుకు వెళ్తుంటే గొడుగులు, రెయిన్‌కోట్‌లు, రెయిన్‌బూట్‌లను ఉపయోగించండి. ఇవి పిల్లలను వర్షంలో తడవకుండా కాపాడతాయి.

వర్షా కాలంలో రోజూ కురుస్తున్న వర్షం వల్ల వాతావరణం చల్లగా మారుతుంది. పిల్లలను చలి నుంచి రక్షించాలంటే వెచ్చటి కాటన్ దుస్తులు, జాకెట్లు, స్వెటర్లు ధరింపజేయండి. వర్షా కాలంలో దుస్తులు ఆరకపోవడం ఒక రకంగా పెద్ద సమస్య. తల్లిదండ్రులు పిల్లలకు తడిగా ఉన్న దుస్తులు వేయకుండా పూర్తిగా ఆరిన తర్వాతే దుస్తులు వేయాలి. తడి దుస్తులు ధరించడం వల్ల పిల్లల్లో ఫంగల్ వ్యాధులు వస్తాయి. చంటి పిల్లల డైపర్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తడి డైపర్లను మారుస్తూ ఉండాలి. ఇతర కాలాల కంటే వర్షా కాలంలో పిల్లలు ఎక్కువగా మూత్ర విసర్జన చేస్తారు. డైపర్లను వెంటవెంటనే మార్చకపోతే పిల్లల చర్మంపై దద్దుర్లు వస్తాయి. వర్షా కాలంలో ఫ్లూ, జలుబు, తుమ్ములు, ఇతర లక్షణాలు సాధారణం. ముందుగా లక్షణాలను గుర్తించి వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. ప్రారంభ దశలో వ్యాధిని ఎదుర్కోవడానికి తగు జాగ్రత్తలు తీసుకోండి. వానా కాలంలో దోమల బెడద తీవ్రంగా ఉంటుంది.



చాలా రకాల జ్వరాలకు దోమలే ప్రధాన కారణం. పిల్లలు పడుకునే ప్రదేశంలో దోమతెరను ఏర్పాటు చేయండి. రాత్రిపూట పిల్లలు సరిగా నిద్రపోతున్నారో లేదో గమనించండి.శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను వేయండి. రాత్రి సమయంలో కిటికీలు, తలుపులు మూసివేయండి. వైద్యుల సూచనలతో దోమలను వికర్షించే మందులను చర్మానికి వాడవచ్చు. ఇంటి చుట్టూ ఎక్కడా నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. చిన్న చిన్న పాత్రలు, వాడని వస్తువుల్లో నీళ్లు నిలువ ఉంటే దోమలు పెరిగే అవకాశం ఉంది. వర్షా కాలంలో చిన్న పిల్లలకు రోజూ స్నానం చేయించాల్సిన అవసరం లేదు. చిన్న పిల్లల స్నానానికి గోరువెచ్చని నీటిని మాత్రమే ఉపయోగించండి. వర్షా కాలంలో వానలో తడుస్తూ కాగితపు పడవలు తయారు చేసి నీటిలో వేస్తూ ఆడుకోవడం పిల్లలకు అలవాటు. అలా ఎక్కువగా బయట ఆడకుండా చూసుకోవాల్సిన బాధ్యత పెద్దవాళ్లపై ఉంది. ఉరుములు, మెరుపులతో కురిసే వర్షంలో పిల్లల్ని బయటకు పంపరాదు.వర్షా కాలంలో ఆహారం సరిగా జీర్ణం కాదు.. బయట దొరికే చిరుతిళ్లు, నూనె పథార్థాలను పూర్తిగా దూరంగా ఉంచాలి. ఇంట్లోనే పిల్లలకు ఎప్పటికప్పుడు వేడి వేడి ఆహారాన్ని అందించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

# ముల్లంగి కూర.. ఆరోగ్యకరమైనది!




వర్షా కాలంలో ముల్లంగి తినడం వల్ల సాధారణ జలుబు, ఫ్లూ వంటి వ్యాధులతో పోరాడవచ్చు. ఇక్కడ రుచికరమైన ముల్లంగి కూర రెసిపీని అందిస్తున్నాం.

వానాకాలం సీజన్‌లో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి. పూర్తిగా పచ్చిగా తినడం లేదా నూనెలో వేయించిన వేపుళ్లు తినడం ఈ సీజన్‌లో ఏ మాత్రం మంచిది కాదు. కూరగాయలను శుభ్రంగా కడిగి, బాగా ఉడికించుకొని గ్రేవీ, సూప్‌లాగా తినడం చాలా ఆరోగ్యకరం. ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంచేటువంటి కూరగాయలను మీ డైట్‌లో చేర్చుకోవాలి. ఈ జాబితాలో ముల్లంగి కచ్చితంగా



ముల్లంగి ఘాటుగా, కారంగా ఉండే ఒక దుంప కూరగాయ. వర్షా కాలంలో ముల్లంగి తినడం వల్ల సాధారణ జలుబు, ఫ్లూ వంటి వ్యాధులతో పోరాడవచ్చు. ఇది మెరుగైన జీర్ణక్రియకు, శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి, రక్తపోటు నియంత్రణకు కూడా సహాయపడుతుంది. ముల్లంగిని కూరగా వండుకోవచ్చు, సలాడ్ రూపంలోనూ తినవచ్చు. ఇక్కడ రుచికరమైన ముల్లంగి కూర రెసిపీని అందిస్తున్నాం, మీరూ ఇలా వండుకొని తినడానికి ప్రయత్నించండి.




# గుడ్డు... చర్మానికీ వెరీ గుడ్!

కోడిగుడ్డులోని తెల్లసొనను ఫేస్ ప్యాక్‌గా ఉపయోగించడం వల్ల మెరిసే చర్మాన్ని పొందవచ్చు. తెల్ల సొనను ముఖానికి ఫేస్ ప్యాక్ లా అప్లై చేసి, ఇరవై నిమిషాల వరకు ఆరనివ్వాలి. ఈ సమయంలో తెల్ల సొనలోని పథార్థాలు చర్మంలోకి శోషించబడతాయి. ఫేస్ ప్యాక్ ఆరిన తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని కడుక్కోవాలి. గోరువెచ్చని నీటిని ఉపయోగించవద్దు ఎందుకంటే ఇది చర్మానికి హానిని కలిగిస్తుంది. ఫేస్ ప్యాక్ తొలగించిన తర్వాత మాయిశ్చరైజర్ అప్లై చేయాలి. ఇది చర్మాన్ని హైడ్రేట్ గా , ఆరోగ్యంగా ఉంచుతుంది.

గుడ్డులో మన ఆరోగ్యానికి కావాల్సిన పోషకాలెన్నో ఉంటాయి. చిన్న పిల్లల నుంచి, పెద్దల వరకు అందరి ఆహారంలో గుడ్డు చాలా కామన్. గుడ్డులో దాగి ఉన్న ఆరోగ్య రహస్యాలు అందరికీ తెలుసు.. కానీ గుడ్డులో దాగి ఉన్న చర్మ సౌందర్య రహస్యాలు ఎక్కువ మందికి తెలియవు. రోజుకు ఒక గుడ్డు తినడం వల్ల శరీరానికి సరిపడా పోషకాలు అందడంతో పాటు, అందాన్ని మెరుగుపరుచుకోవడానికి దోహదపడుతుందని వైద్యులు చెబుతున్నారు. ఆరోగ్యంతో పాటు గుడ్డు వల్ల లభించే అందం గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం..

ఈ ఫేస్ ప్యాక్ ను వారానికి రెండు సార్లు చేసుకుంటే సరిపోతుంది. ఎక్కువ సార్లు ఫేస్ ప్యాక్ వాడినట్లయితే చర్మం పొడిబారవచ్చు. చర్మ రకానికి సరిపోయే ఫేస్ ప్యాక్‌ని ఎంచుకోవడం ఉత్తమం. సున్నితమైన చర్మం ఉన్నవారు తేలికపాటి పదార్థాలతో చేసిన ఫేస్ ప్యాక్‌ని ఉపయోగించాలి.



### ఫేస్ ప్యాక్ తయారీ విధానం

: ముందుగా ఒక పచ్చి గుడ్డును పగలగొట్టి దాని నుండి పచ్చసొనను వేరు చేసి, మిగిలిన తెల్ల సొనను ఒక గిన్నెలో కలపాలి. ముఖాన్ని శుభ్రం చేసి సన్నగా అప్లై చేయాలి. ఇరవై నిమిషాలు అలాగే ఉంచి చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి.

### మొటిమలు తగ్గించుకునేందుకు :

ఒక గుడ్డు పచ్చసొనలో 1 టీస్పూన్ టీ ట్రీ ఆయిల్ జోడించండి. దీన్ని కూడా ముఖంపై అప్లై చేసి, ఇరవై నిమిషాల తర్వాత చల్లని నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. టీ ట్రీ ఆయిల్‌లో యాంటీ బాక్టీరియల్ , యాంటీ ఫంగల్ లక్షణాలున్నాయి, ఇవి మొటిమలను తగ్గిస్తాయి.

### ముఖ్య గమనిక

గుడ్డు అలెర్జీ ఉన్న వాళ్లు ఈ చిట్కాను ఉపయోగించవద్దు. ఏవైనా చర్మ సమస్యలుంటే వైద్యుడి సలహా మేరకు చిట్కాను ఉపయోగించండి. ఈ ప్యాక్‌ని వారానికి రెండుసార్లు మాత్రమే ఉపయోగించండి. ఫేస్ ప్యాక్ వాడుతున్నప్పుడు ఏవైనా దుష్ప్రభావాలు సంభవిస్తే, వెంటనే దాన్ని ఆపివేసి, వైద్యుడిని సంప్రదించండి.





